

ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్లు

పాతశ్రీకాకుళం, జూలై18(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ ఐటీఐ (డీఎల్‌టీసీ)లో రెండో విడత ప్రవేశాలు జరగనున్నాయి. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలి. ఈ నెల 22 మధ్యాహ్నం 1 గంట లోగా డీఎల్‌టీసీలో ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకోవాలి. ఇప్పటివరకు మొత్తం 763 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 571 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు మాత్రమే పరిశీలన పూర్తయింది. వీరికి ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 95051 61701, 99639 45259, 98859 60809 నెంబర్లను సంప్రదించాలి.

ఆలస్యం చేయవద్దు

- మెళియాపుట్టి మండలం పోగడవల్లి పాఠశాలలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు 2018లో సైబర్ వలలో చిక్కుకొని సుమారు రూ.1.50 లక్షలు పోగొట్టుకు న్నారు. దీనిపై వెంటనే పోలీసులను ఆశ్రయించకుండా నిర్లక్ష్యం చేశారు. నెల తరువాత స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అప్పటికే ఆలస్యం కావడంతో నగదు రికవరీ సాధ్యం కాలేదు. ఇప్పటికీ పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం శూన్యం.
- టెక్కలి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన ఓ రిటైర్డ్ టీచర్ శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. ఇటీవల అతని బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.40 వేలు కాజేశారు. డబ్బులు తీసినట్లు ఆ రిటైర్డ్ టీచర్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. గంటలోపే ఆయన పోలీసులను ఆశ్రయించారు. దీంతో పది రోజుల్లోనే తిరిగి తన ఖాతాలో రూ.40 వేలు జమైంది.



- గత నెల 14న శ్రీకాకుళంలోని ఓ వైద్య కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రేవతికి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. బెంగళూరు పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. హ్యూమన్ ట్రాకింగ్‌లో మీ పేరు ఉందని, సీబీఐ కేసు నమోదు చేసి విచారిస్తున్నామని బెదిరించారు. కేసును సుప్రీంకోర్టులో వాదించేందుకు కొంత డబ్బును డిపాజిట్ చేయాలని, అంతవరకు మీ అరెస్టు ఆగుతుందని చెప్పారు. దీంతో భయపడిన వైద్యురాలు రేవతి.. వారు చెప్పిన పలు అకౌంట్లకు రూ.16 లక్షలు ఆన్‌లైన్‌లో జమ చేశారు. కొన్ని రోజుల తర్వాత మోసపోయానని గ్రహించిన ఆమె శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టి మైసూర్‌కు చెందిన ముగ్గురు సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.6లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

- సైబర్ వలలో చిక్కుకుంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు
- గంటలోపే చేస్తే నగదు రికవరీకి అవకాశం
- సైబర్ నేరాల్లో గోల్డెన్ అవర్ కీలకం



మెళియాపుట్టి, జూలై 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువయ్యాయి. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని చాలామంది పెద్దమొత్తంలో డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అయితే, చాలా మంది బాధితులు వెంటనే పోలీసులను ఆశ్రయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. రోజుల తరబడి ఆలస్యం చేసి, ఆ తరువాత పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. దీనివల్ల సైబర్ నేరగాళ్ల నుంచి డబ్బులను తిరిగి రాబెట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారుతుంది. బ్యాంకు అకౌంట్‌ల నుంచి నగదు మాయమైన మొదటి గంటల్లోపే బాధితులు ఫిర్యాదు చేయాలని, దీనివల్ల సొమ్ముతిరిగి పొందడానికి, సైబర్ నేరగాళ్లను సులువుగా గుర్తించటానికి అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. జిల్లాలో గత ఏడాదిన్నరలో 204 సైబర్ కేసులు నమోదయ్యాయి. సుమారు రూ.7 కోట్లు నగదు సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు. ఇందులో కేవలం రూ.60 లక్షలు మాత్రమే పోలీసులు రికవరీ చేశారు. సైబర్‌లో వలలో చిక్కుకున్న వారు వెంటనే పోలీసులకు సమాచారం అందజేయకపోవడంతో ఆ సొమ్మును నేరగాళ్లు నిమిషాల వ్యవధిలోనే వేర్వేరు రాష్ట్రాల్లోని వందల ఖాతాల్లోకి బదిలీ చేస్తున్నారు. ఆ వెంటనే ఏటీఎంల ద్వారా నగదు డ్రా చేయడం లేదా క్రిప్టో కరెన్సీగా మార్చేయడం వంటివి చేస్తున్నారు. దీనివల్ల సొమ్మును (మిగతా 6వ పేజీలో..)



శ్రీకాకుళం నగరంలో రోడ్డు, కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

- జిల్లాలో పెరుగుతున్న వినియోగం
- పర్యావరణానికి తీవ్ర ముప్పు
- జూట్, కాగిత సంచులు ఉపయోగించాలంటున్న పర్యావరణవేత్తలు

శ్రీకాకుళం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం కానరావడం లేదు. నగరాలు, పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరిగింది. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తోన్నాయి. శ్రీకాకుళం నగరంలో ప్రతిరోజూ రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి. నగరం చెంతనే ఉన్న నాగావళి నదిలో సగటున రోజుకు టన్నుల రూపంలో ప్లాస్టిక్ వ్యర్థాలు కలుస్తున్నాయి. ఉదయం పాల ప్యాకెట్ల నుంచి రాత్రి వరకు దయనందిన జీవితంలో ప్రతి వినియోగానికి ప్లాస్టిక్ వాడుతుండడం ఆందోళన కలిగిస్తుంది. ఆరు నెలల కిందట ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న 110 మంది వ్యాపారులను గుర్తించి రూ.3లక్షల అపరాధ రుసుం వసూలు చేశారు. ఆ తర్వాత తనిఖీలు లేకపోవడంతో నగరంలో ప్లాస్టిక్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో ప్లాస్టిక్ విక్రయాలు అధికంగా ఉన్నాయి. ప్రతి నెల టన్ను మేర ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు జరుగుతున్నట్టు తెలుస్తుంది. ఆమదాలవలసలో సైతం రోజుకు 26 టన్నుల చెత్తను సేకరిస్తుండగా అందులో రెండు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. పలాస, కాశీబుగ్గ, మున్సిపాలిటీలో 29 టన్నుల చెత్త సేకరణ జరుగుతుండగా నాలుగు టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నట్టు తెలుస్తోంది.

నిబంధనలు బేఖాతరు..

జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. విక్రయదారులు కనీస నిబంధనలు పాటించడం లేదు. వాస్తవానికి 2022లో ప్లాస్టిక్‌ను కేంద్రం పూర్తిగా నిషేధించింది. కానీ, జిల్లాలో అదెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. నగర పాలక సంస్థలు, మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. కానీ, కొందరు ఆ లైసెన్స్‌లు లేకుండానే విక్రయాలు చేపడుతున్నారు. అయినా సరే యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 125 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులనే వినియోగించాలి. ఆలోపు ఉన్నవి పూర్తిగా వినియోగించకుండా (మిగతా 6వ పేజీలో..)

మెడికల్ షాప్‌లు



- దుకాణాల్లో కానరాని నిబంధనలు
- నాసిరకం మందుల విక్రయం
- జిల్లాలో తనిఖీలు అంతంత మాత్రమే
- వేధిస్తున్న డ్రగ్స్ సిబ్బంది కొరత
- జనరిక్ షాపుల ఏర్పాటుకు ప్రభుత్వ నిర్ణయం

ఇచ్ఛాపురం, జూలై18(ఆంధ్రజ్యోతి):మూడు నెలల కిందట జిల్లా వ్యాప్తంగా ఔషధ దుకాణాల్లో తనిఖీలు జరిగాయి. పెద్ద ఎత్తున నకిలీ, కాలం చెల్లిన మందులు వెలుగులోకి వచ్చాయి. దీంతో పెద్ద కలకలం రేగింది. కొద్ది రోజుల పాటు వీటి విషయంలో కట్టడి జరిగింది. కానీ, ఇప్పుడు షరా మామ్మూలే అన్నట్టు పరిస్థితి మారింది. ఎప్పుడో అత్యవసర సమయాలు, అనుకోని ఘటనలు జరిగినప్పుడు మాత్రమే అధికారులు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. ఆ తరువాత అటువైపు చూసేవారు కరువవుతున్నారు. దీంతో నాసిరకం, నాణ్యత లేని, కాలం చెల్లిన మందులు వినియోగంలోకి వస్తున్నాయి. ప్రజారోగ్యంపై విపరీతంగా ప్రభావం చూపుతున్నాయి.వీటిని పర్యవేక్షించి అడ్డుకట్ట వేయాల్సిన సిబ్బంది లేక సమస్యలు ఎదురవుతున్నాయి.

త్వరలో జనరిక్ షాపులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజారోగ్యంపై దృష్టిపెట్టింది. అందులో భాగంగా భారీగా జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు (మిగతా 6వ పేజీలో..)

ప్రైవేటు ఆస్పత్రుల వద్ద అధికం..

ప్రైవేటు ఆస్పత్రులు నడిపే మెడికల్ షాపుల వద్ద దందా అంతా ఇంతా కాదు. అక్కడ పనిచేసే సిబ్బంది అంతా పదో తరగతి లోపువారే. కనీసం అవగాహన ఉండదు వారికి. కనీసస్థాయిలో నిబంధనలు పాటించరు. చలామణిలో లేనివి, కనీస అనుమతులు లేని కంపెనీల నుంచి మందులను తెప్పించి రోగులకు అంటగడుతున్నారు. ముఖ్యంగా మందుల దుకాణదారులు ఆర్ఎంపీలతో ఎక్కువగా ఒప్పందాలు చేసుకుంటున్నారు. వారి ద్వారా సైతం ఇటువంటి మందులు భారీగా చలామణి అవుతున్నట్టు తెలుస్తోంది.

సిబ్బంది కొరత

జిల్లాలో డ్రగ్స్ కంట్రోల్‌లో సిబ్బంది కొరత అధికంగా ఉంది. ఇంత పెద్ద వ్యవస్థకు పరిశీలనలో ఉన్నది కేవలం ఒకేఒక సహాయ సంచాలకుడు. టెక్కలిలో ఒక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. శ్రీకాకుళంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ ఉంది. ఇద్దరితో పర్యవేక్షణ కరువవుతోంది. జిల్లాలో 1500 వరకూ మందుల దుకాణాలు ఉన్నాయి. రోజుకు రూ.కోట్లలో వ్యాపారాలు, క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. మందుల షాపు వద్దకు వెళితే.. ఒక మందులకు బదులు మరో మందులు ఇస్తుంటారు. దీంతో చాలా దుష్పరిణామాలు కలుగుతున్నాయి. అసలు మందుల షాపులు నిర్వహించేవారికి కూడా మందులపై అవగాహన లేని పరిస్థితి. ఎవరో డి-ఫార్మసీ చేసేవారి సర్టిఫికెట్‌ను ఏడాదికి ఇంత అని లీజుకు తీసుకుని వ్యాపారం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఒడిశా టు ముంబై

- గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు
- ఇచ్ఛాపురంలో పట్టుకున్న పోలీసులు
- 13 కేజీల సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నుంచి ముంబైకి గంజాయిని తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులు పోలీసులకు చిక్కారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో వారిని అరెస్టు చేసి 13కేజీల 90గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈవివరాలను శుక్రవారం ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నంనాయుడు వెల్లడించారు. ముంబైకి చెందిన గంజాయి వ్యాపారి అజయ్ ముంబైలోనే నివాసముంటున్న చౌరాసియా అనే వ్యక్తిని కలిశాడు. అతని ద్వారా త్రిలోక్ నాధూరామ్ దొల్‌పూరియా అనే వ్యక్తిని కలిసి గంజాయి కావాలని అడిగాడు. దీంతో దొల్ పూరియా తనకు పరిచయమున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఖర్డింగు గ్రామానికి చెందిన సునీల్ పాయక, అతని స్నేహితుడు మహన్ నాయక్‌ను సంప్రదించి గంజాయి కావాలని చెప్పాడు. దీంతో సునీల్ పాయక, మహన్ నాయక్‌లు వారి గ్రామానికి చెందిన గంజాయి వ్యాపారి నంత బీరో నుంచి కేజీ గంజాయి రూ.3వేలు చొప్పున 13కేజీల 90గ్రాములు కొనుగోలు చేశారు. ఆ గంజాయిని త్రిలోక్ నాధూరామ్‌కు అప్పగించారు. ఈ గంజాయిని పట్టుకుని ముంబైలోని చౌరాసియాకు కేజీ రూ.8వేలు చొప్పున అప్పగించేందుకు సునీల్ పాయక, త్రిలోక్ నాధూరామ్ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. వారి కదలికలు అనుమానంగా ఉండడంతో పట్టణ ఎస్ఐ ముకుందరావు పట్టుకుని తనిఖీ చేశారు. వారి బ్యాగుల్లో గంజాయి ఉండడంతో ఇద్దర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటు బైక్, మూడు సెల్ ఫోన్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

డిగ్రీ అడ్మిషన్లకు లైన్ క్లియర్



నరసన్నపేట డిగ్రీ కళాశాల

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్టుల విధానంపై స్పష్టత కరువు

నరసన్నపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశాలకు ఎట్టకేలకు లైన్‌క్లియర్ అయింది. ఏప్రిల్‌లో ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడగా, మూడు నెలల తరువాత డిగ్రీ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కొన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మిషన్లకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలోని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 101 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో ఆర్ట్స్, సైన్స్, సోషల్ వర్క్, కామర్స్, కంప్యూటర్ సైన్సు సబ్జెక్టుల్లో బీఏ, బీఎస్సీ, బీకాం అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ప్రవేశాలకు ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు స్వీకరించేవారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించే కళాశాలలు ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. దరఖాస్తు స్వీకరించిన ప్రిన్సిపాల్ తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. ప్రతి ఏటా అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో సుమారు 12 వేల మందికి పైగా విద్యార్థులు చేరేవారు. అయితే, ఈ ఏడాది ప్రవేశాల ప్రక్రియ జాప్యం కావడం, ఇంటర్‌లో ఉత్తీర్ణత తగ్గడం, సైన్సు విద్యార్థులు ఇంజనీరింగ్‌పై మొగ్గు చూపడం వంటి కారణాలతో అడ్మిషన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి..

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసే విద్యార్థులు వారు చేరే (మిగతా 6వ పేజీలో..)

చట్టాలను కఠినంగా అమలు చేయాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పౌరహక్కుల పరిరక్షణ, అట్టడుగు వర్గాల రక్షణ కోసం పీసీఆర్, పీవోఏ చట్టాలను కఠినంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యాచార నిరోధక చట్టం (పీసీఆర్ అండ్ పీవోఏ యాక్ట్) అమలు అంశాలను అధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. అట్టడుగు వర్గాలపై జరిగే హింసాత్మక చర్యలను అరికట్టడంలో నిర్లక్ష్యానికి తావు లేదని హెచ్చరించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు 9 మంది బాధితులకు రూ.6,95,052 పరిహారం అందించాం. 11 మందికి (మిగతా 6వ పేజీలో..)

ప్యానల్ లిస్టులో జిల్లా డీఎస్పీలకు చోటు

శ్రీకాకుళం క్రైం,జూలై 18 (ఆంధ్రజ్యోతి): డీఎస్పీలు, ఏసీపీలు.. అదనపు ఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందేందుకు రూపొందించిన అర్హత ప్యానెల్ లిస్టులో జిల్లా నుంచి ముగ్గురు డీఎస్పీలకు చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి ఉత్త ర్వులు అందాయి. రాష్ట్రంలో మొత్తం 61 మందికి ఈ జాబితాలో చోటు దక్కింది. ఇందులో శ్రీకాకుళం డీఎస్పీ శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి (డీజీపీ కార్యాలయంలో ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నారు.), శ్రీకాకుళం ఏపీఎస్పీ బెటాలియన్-1 డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి ఉన్నారు. మొదటి దశలో 30 మంది, రెండో దశలో మిగతా వారు ఉద్యోగోన్నతి పొందే అవకాశముంది.

దివ్యాంగుల వెతలు
- గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు
- అర్జీలను స్వీకరించిన కలెక్టర్, జేసీ
- తక్షణ చర్యలకు ఆదేశాలు
6లో

ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళమే లక్ష్యం
- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ 6లో

ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్సు రద్దు 8లో



నాగావళి నదిలో వల విసురుతున్న మత్స్యకారుడు

నాగావళికి జలకళ.. వేసేద్దాం చేపలకు వల

అరసవల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నిన్న మొన్నటి వరకు చుక్క నీరు లేక నాగావళి నది ఎడారిని తలపించింది. నగరంలోని కాలువల మురుగునీరు చేరి డ్రైనేజీ కాలువను తలపిం చింది. ఇటీవల అడప దడపా కురవడంతో నదికి నీరు వచ్చింది. ప్రతి ఏటా నదిలోకి కొత్తనీరు వచ్చినప్పుడు చేపలు అధికంగా వస్తాయి. దీంతో మత్స్యకారులు వేట సాగిస్తారు. స్థానిక కొత్త బ్రిడ్జి, పాత బ్రిడ్జి, పొన్నాడ బ్రిడ్జి వద్ద నాగావళి నదిలో గార మండలం, బలరాంపురం గ్రామానికి చెందిన 30 మంది మత్స్యకారులు తమ వలలకు పని చెప్పారు. ఉదయాన్నే నది వద్దకు చేరుకుని చేపలను పడుతుంటారు. 5 కేజీల పెద్ద చేపలు వలలకు చిక్కడంతో అక్కడికక్కడే పాత వంతెనపై అమ్మకాలు చేపట్టారు. ప్రజలు కూడా పెద్ద ఎత్తున చేపలను కొనుగోలు చేశారు.



వలకు చిక్కిన 6 కేజీల చేపను కొత్త వంతెనపై విక్రయిస్తున్న దృశ్యం





కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్యకు పలాస జీడి పప్పు రకాలు చూపిస్తున్న వ్యాపార సంఘ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు

ప్రత్యామ్నాయ జీడి ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి

- పలాస పరిశ్రమల విధానం ఎంతో బాగుంది
- పర్యావరణానికి విఘాతం లేకుండా 30 శాతం చెట్లు పెంచాలి
- రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

పలాస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జీడి పప్పుతో పాటు వాటి ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టి పరిశ్రమల ఆదాయం పెంచుకోవాలని రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్య వ్యాపారులకు సూచించారు. పలాస వచ్చిన ఆయన పారిశ్రామికవాడ జీడి పరిశ్రమల సముదాయాన్ని పరిశీలించారు. ఇటీవలే తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తున్న ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్, సాయికృప జీడి పరిశ్రమలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త అంధవరపు రతన్‌బాబు పరిశ్రమల నిర్వహణ, కార్మికులకు ఉపాధి, జీడి పప్పు తయారీ విధానం, అంతర్జాతీయ ప్రమాణాలతో ప్యాకేజీని ఆయనకు వివరించారు. చైర్మన్ పరిశ్రమలను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణ విధానం బాగుందన్నారు. కాలుష్య నివారణకు ఒక్కో పరిశ్రమలో కనీసం 30 శాతం మొక్కలు పెంచాలని ఆదేశించారు.

- ఎస్ఎస్ఎస్ పరిశ్రమ చైర్మన్ కోరాడ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే తాము జీడి పరిశ్రమలు నెలకొల్పామన్నారు. జీడిపప్పు రకాలను పారిశ్రామికవాడ అధ్యక్షుడు మల్లా రామేశ్వరరావు వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 13 రకాల జీడి పప్పును విడదీసి అమ్మకాలు చేస్తామని, విదేశీ మారకం కూడా దీనివల్ల లభిస్తుందని వివరించారు. అంతకుముందు కృష్ణయ్య పారిశ్రామికవాడలో మొక్కలు నాటారు. ఈఈ బి.కరుణశ్రీ, పీసీఎంఏ అధ్యక్షుడు మల్లా శ్రీనివాస్, కార్యదర్శి టంకాల రవిశంకర్‌గుప్తా, పారిశ్రామికవాడ కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, తాళాసు శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య

ప్లాస్టిక్ రహిత శ్రీకాకుళమే లక్ష్యం

- కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరాన్ని అక్టోబరు 2వ తేదీ నాటికి ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి కలెక్టరేట్ వీసీ హాలులో ఆయ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ శ్రీకాకుళం ఒక ఉద్యమంగా మారాలన్నారు. ఆర్డీవో, జిల్లా పంచాయతీ అధికారితో పాటు ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు రహదారులు, బస్టాండ్లు, మార్కెట్లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద స్వచ్ఛత సందేశాల బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు అమలులో ఉన్నాయని, వీటి ప్రకారం మున్సిపల్ స్థాయిలో విడదీసే సేకరణ, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ వ్యవస్థలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. అనుమతి లేని పలుచని క్యారీ బ్యాగులు, మల్టీ లేయర్ ప్యాకేజింగ్ వినియోగంపై కఠిన చర్యలు ఉండాలన్నారు. స్థానిక సంస్థలు ప్లాస్టిక్ చెత్తను సేకరించి, మరలా ఉపయోగించే చక్రంలోకి తీసుకురావాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, కేసులు, లైసెన్సు రద్దు వంటివి అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ కరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ బీవీడీ ప్రసాదరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ఆమదాలవలస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో పైనాపిల్ విలువ ఆధారిత ఉత్పత్తులపై గిరిజన యువతకు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత ఆధ్వర్యంలో పైనాపిల్ పైనాపిల్ పండ్ల రసాలు, క్యాండీ తయారీపై చర్చించారు. పైనాపిల్‌లో ఉండే పోషక విలువలు ఆరోగ్యపరంగా ఎంతో లాభదాయకమని శాస్త్రవేత్త వివరించారు. ముఖ్యంగా జీర్ణవ్యవస్థ మెరుగుపడడమే కాకుండా.. కొన్ని అధ్యయనాలు ప్రకారం క్యాన్సర్ నివారణకు కూడా ఇది సహాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మీ, నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ కె.రమేష్‌కృష్ణ, ఆర్ఫ్ సంస్థ కో-ఆర్డినేటర్ ఎన్.అనూప్, మన్యం సహజ ఉత్పత్తిదారులు సంఘం సీఈవో బి.శంకరరావు, సభ్యులు, గిరిజన యువతి యువకులు పాల్గొన్నారు.



గిరిజన యువతకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

దివ్యాంగుల వెతలు

- గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు
- అర్జీలను స్వీకరించిన కలెక్టర్, జేసీ
- తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశాలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అర్జీలపై తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన దివ్యాంగుల గ్రీవెన్స్ స్వాభిమాన్‌లో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గతంలో వచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలను వారికి తెలియజేయాలన్నారు. ఈసందర్భంగా పలువురు దివ్యాంగులు తమ వెతలను కలెక్టర్, జేసీకి వినిపించారు. తమను ఆదుకోవాలని కోరారు. ఆ వివరాలు ఇలా..



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆ చెల్లెలి త్యాగం నిరుపమానం..

- అక్క కోసం జీవితాన్ని అంకితం చేసిన మహిళ



దివ్యాంగురాలు పాలిశెట్టి విజయలక్ష్మిని ఎత్తుకుని గ్రీవెన్స్‌కు తీసుకువస్తున్న దృశ్యం

పూర్తి దివ్యాంగురాలైన అక్క మంచానికే పరిమితమైంది. తల్లిదండ్రులు మరణించారు. బతికేందుకు ఏ ఆధారం లేదు. నిరుపేద కుటుంబం. అయినా సరే ఆ మహిళ కదలలేని స్థితిలో ఉన్న అసహాయురాలైన అక్కను విడిచి పెట్టలేదు. ఆస్తి కోసం, అవసరం కోసం కుటుంబ సభ్యులనే దూరం పెడుతున్న ఇప్పటి పరిస్థితుల్లో ఆ యువతి అక్క కోసం తన జీవితాన్నే త్యాగం చేసింది. తన అక్క కోసం వివాహం కూడా చేసుకోలేదు. ఓ ప్రైవేటు షాపులో చిరుద్యోగిగా పనిచేస్తూ దివ్యాంగురాలైన అక్కను కన్నబిడ్డలా సాకుతూ వస్తోంది. శ్రీకాకుళం నగరం కత్తెర వీధికి చెందిన పాలిశెట్టి రమామణి గ్రీవెన్స్ "స్వాభిమాన్"కు తన అక్కతో కలిసి వచ్చింది. కలెక్టర్‌ను కలిసి పూర్తిగా మంచానికే పరిమితమైన తన అక్క పాలిశెట్టి విజయలక్ష్మికి పూర్తి పింఛనును ఇప్పించి ఆదుకోవాలని వేడుకుంది. పేదరికంలో మగ్గిపోతున్నామని, తాను చేస్తున్న చిరుద్యోగం ద్వారా వచ్చే ఆదాయంతో ఇంటి అద్దె, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, పూర్తి స్థాయి దివ్యాంగ పింఛను రూ.15వేలు అందజేసి ఆదుకోవాలని విన్నవించుకున్నారు.

లారీ రూపంలో విధి కాటేసింది..

- ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు



రెండు కాళ్లు ప్రమాదంలో పోగొట్టుకుని దివ్యాంగుడైన గేదెల చిన్నారావు

అతను చదువుకున్నాడు. రణస్థలంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. అందరిలాగే ఎన్నో కలలతో వివాహం చేసుకున్నాడు. ఓ కుమార్తె కూడా. ఆనందంగా సాగిపోతున్న వారి జీవనాన్ని విధి లారీ రూపంలో కాటేసింది. విధులు ముగించుకుని వస్తుండగా లారీ గుద్దేయడంతో రెండు కాళ్లు నుజ్జునుజ్జయిపోయాయి. వైద్యులు రెండు కాళ్లను తొలగించారు. ఇంటికి జీవనాధారమైన అతను కుంగిపోయాడు. తన భార్య, కుమార్తెలను ఎలా పోషించుకోవాలో తెలియక ఆవేదనలో మునిగిపోయాడు. ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన గేదెల చిన్నారావుకు 90 శాతానికి పైగా వికలాంగ ధ్రువపత్రం ఉంది. పూర్తిస్థాయి పింఛను అందజేసి తమను ఆదుకోవాలని గ్రీవెన్స్‌లో శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశాడు. ఆశగా పింఛను కోసం ఎదురుచూస్తున్నాడు.

వంద శాతం వికలాంగ ధ్రువపత్రం ఉంది..

- పూర్తిస్థాయి పింఛను ఇప్పించి ఆదుకోండి



దివ్యాంగురాలు కోరాడ సాయిప్రణతిని గ్రీవెన్స్‌కు తీసుకువస్తున్న దృశ్యం

జిల్లాలోని పోలాకి మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన కోరాడ సాయి ప్రణతి పూర్తి దివ్యాంగురాలు. మంచానికి మాత్రమే పరిమితమైన జీవితం. తండ్రి చిన్న చిన్న ప్రైవేటు పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. పూట గడవడమే కష్టమైన దీనపరిస్థితి. పూర్తి స్థాయి దివ్యాంగ పింఛను రూ.15వేలు ఇప్పించి తమ కుమార్తెను, కుటుంబాన్ని ఆదుకోవాలని స్వాభిమాన్‌లో కలెక్టర్‌ను వేడుకున్నారు.

బ్యాటరీ సైకిల్ ఇప్పించండి..

- నా కష్టంపై నేను బతుకుతా



దివ్యాంగ యువకుడు సవర అరుణ్‌కుమార్

ఎల్.ఎన్.పేట మండలం కొత్త బాలేరు గ్రామానికి చెందిన సవర అరుణకుమార్ దివ్యాంగుడు. రెండు కాళ్లు లేక నడవలేని పరిస్థితి. డిగ్రీ వరకు చదువుకున్నాడు. బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ ఇప్పిస్తే తన పనులు తాను చేసుకోగలుగుతానని, అలాగే ఎక్కడైనా ఉద్యోగంలో చేరితే విధులను నిర్వర్తించేందుకు సైకిల్ ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు. తన కష్టంపై బతకాలన్నదే తనఅభిమతమని, అందుకు సహకరించాలని వేడుకున్నాడు.

- రాష్ట్ర ఉద్యోగుల గ్రీవెన్స్‌పై ఏపీ ఎన్జీవో నాయకుడు హనుమంతు సాయిరాం కారుణ్య నియామకాలు, ఉద్యోగులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కొన్నింటికి మాత్రమే వైద్యం అందుతున్నట్లు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ డి.పృథ్వీరాజ్‌కుమార్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో విభిన్న ప్రతిభావంతులశాఖ ఇన్‌ఛార్జి ఏడీ శ్రీధర్ రాజా, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ నిషేధం ఎక్కడ?

(ఐదో పేజీ తరువాయి)

నిషేధం విధించింది. కానీ, జిల్లాలో మాత్రం ఆ నిబంధనలు పట్టించుకోవడం లేదు. పురపాలక, కాలుష్య నియంత్రణ మండలి, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాల్సి ఉంది. అయితే, ఆ శాఖలు మాత్రం నిద్దరోడుతున్నట్టు విమర్శలు ఉన్నాయి.

మానవాళికి ముప్పు..

ప్లాస్టిక్ వస్తువులను మితిమీరి వినియోగించడం వల్ల పర్యావరణంతో పాటు మానవాళికి ముప్పు ఏర్పడుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. గోనె, కాగిత సంచులు వినియోగించాలని మొరపెట్టుకుంటున్నా ప్రజల చెవికెక్కడం లేదు. అల్పాహార, మాంసాహార హోటళ్లు, ఫుట్‌పాత్, టీ దుకాణాల్లో వేడి టీ, కాఫీ, పాలు, కూరలను పాలిథిన్ సంచుల్లో పార్శిల్ చేస్తున్నారు. ఈ పదార్థాలు తినడం వల్ల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ నిషేధంపై యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టిపెట్టాల్సిన అవసరంఉంది.

కఠిన చర్యలు తీసుకుంటాం..

శ్రీకాకుళం నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. తనిఖీలు పెంచుతాం. పట్టుబడితే భారీ జరిమానాలు విధిస్తాం. వ్యాపారులు, ప్రజలు సహకరించాలి. జూట్ బ్యాగ్‌లను వినియోగించాలి. ఇప్పటికే దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పించాం. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలకు ఉపక్రమిస్తాం.

-ప్రసాద్, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

డిగ్రీ అడ్మిషన్లకు లైన్ క్లియర్

(ఐదో పేజీ తరువాయి)

కళాశాల, అక్కడి కోర్సులను ప్రథమ ప్రాధాన్యతగా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో విద్యార్థులను ఎంపిక చేస్తారు. రిజర్వుడు కేటగిరీ విద్యార్థులకు వారి రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ విద్యార్థులకు మొత్తం సీట్లలో 15శాతం కేటాయిస్తారు. ఈ రిజర్వేషన్లను వర్గీకరణ ప్రకారం అమలు చేస్తారు. సింగిల్ మేజర్ సబ్జెక్టు, డబుల్ మేజర్ సబ్జెకు విషయంలో ఇంకా ఉన్నత విద్యామండలి ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంతో విద్యార్థులకు తీవ్రస్థాయిలో నష్టం ఏర్పడుతుందని, డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలు చేయాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఉన్నత విద్యాశాఖ మాత్రం పాత విధానం మాదిరిగానే సింగిల్ సబ్జెక్టు విధానానికి మొగ్గు చూపింది. దీంతో ఈనెల 21న ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి.

చట్టాలను కఠినంగా అమలు చేయాలి

(ఐదో పేజీ తరువాయి)

ఉద్యోగాలు ఇచ్చాం. జిల్లాలో ప్రస్తుతం పీవోఏ చట్టం కింద ప్రత్యేక కోర్టులో 267 కేసులు విచారణలో ఉన్నాయి. వీటిని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రతి నెల 30న సివిల్ రైట్స్ డే నిర్వహించాలి. వారానికి ఒకసారి అధికారులు ఒక గ్రామాన్ని సందర్శించి, ఆలయ ప్రవేశం, నీటి వనరుల వినియోగం, వేరు గ్లాస్ వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించాలి. ఇందులో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీపీలు, సంక్షేమ శాఖ అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలి.' అని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, పలువురు డీఎస్పీలు, కమిటీ సభ్యులు తోట రాములు, దండాశి రాంబాబు, దాసరి తిరుమలరావు, అప్పన్న, గేదెల రమణమూర్తి, రాజు, శాంతారావు, ఎస్.ప్రభాకరరావు, వి.దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెడి'కిల్' షాపులు

(ఐదో పేజీ తరువాయి)

చేయాలని భావిస్తోంది. డి-ఫార్మసీ పూర్తిచేసుకున్న బీసీ నిరుద్యోగ యువత షాపులు పెట్టుకునే వీలుగా బీసీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయనుంది. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ జరుగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 వరకూ జనరిక్ మందుల దుకాణాలు పెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా జనరిక్ మందులకు ఆదరణ పెరుగుతోంది. ఇతర మందులతో పోలిస్తే జనరిక్ మందుల ధర కూడా చాలా తక్కువ. పైగా సైడ్ ఎఫెక్ట్ పెద్దగా ఉండవు. రోగులకు సగానికి సగం మందుల ఖర్చు తగ్గే అవకాశముంది. అందుకే ప్రోత్సహించాలని నిర్ణయించింది.

తనిఖీలు చేస్తున్నాం..

మెడికల్ షాపుల నిర్వహణలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు. టెక్కలి డివిజన్ పరిధిలో 700 మందుల దుకాణాలు ఉన్నాయి. వీటిలో హోల్‌సేల్ షాపులు 150 ఉండగా మిగిలినవి 550 రిటైల్ షాపులు. నెలలో సుమారుగా 40 సార్లు మండలాల వారీగా తనిఖీలు చేస్తున్నాం. అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. తనిఖీల్లో ఫార్మసిస్ట్ లేకపోవడం, రిజిస్టర్ సరిగ్గా నిర్వహించకపోవడం, కాలం చెల్లిన మందులు కొద్దిగా ఉండటం గుర్తించటం జరుగుతుంది. దీనిపై కేసులు కూడా నమోదు చేస్తున్నాం.

-ఎన్.యుగంధర్, టెక్కలి డివిజన్ ఔషధ నియంత్రణ అధికారి, శ్రీకాకుళం

ఆలస్యం చేయవద్దు

(ఐదో పేజీ తరువాయి)

రికవరీ చేయడం పోలీసులకు కష్టంగా మారుతుంది. అదే గంటలోపు ఫిర్యాదు చేస్తే డబ్బులు వెళ్లిన ఖాతాను గుర్తించి స్తంభింపజేస్తారు. అప్పటికే ఆ ఖాతానుంచి ఇతర ఖాతాలకు నగదు వెళితే బ్యాంకు అధికారుల సహకారంతో వాటిని హోల్డ్‌లో పెడతారు. దీనివల్ల సొమ్ముతిరిగి పొందడానికి, సైబర్ నేరగాళ్లను సులువుగా గుర్తించటానికి అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. ఫిర్యాదు చేయడం ఆలస్యమైన కొద్దీ డబ్బులు రికవరీ చేయడంలో సవాళ్లు ఎదురవుతాయని అంటున్నారు.

ఇలా ఫిర్యాదు చేయాలి..

సైబర్ నేరాల కట్టడికి కేంద్ర ప్రభుత్వం ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేటర్ సెంటర్‌ను ప్రారంభించింది. ఇందులో దర్యాప్తు సంస్థలు, బ్యాంకులను భాగస్వామ్యం చేసింది. సైబర్ మోసాలపై ఫిర్యాదు చేసేందుకు 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను కేటాయించారు. అలాగే, సైబర్ క్రైమ్ వెబ్‌సైట్‌లో కూడా ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి బ్యాంకు ఖాతానెంబర్, సైబర్ నేరస్థుడు వాడిన ఫోన్ నెంబర్ లేదా ఐడీ బ్యాంకు ఖాతా నెంబర్, యూపీఐ వంటి వివరాలను అందించాల్సి ఉంటుంది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు చేపడతారు. దీనివల్ల బాధితులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

అవగాహన కల్పిస్తున్నాం..



సైబర్ మోసాలపై ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఫోన్‌కు వచ్చే అనవసరైన లింక్‌లను తెరవద్దు. సీబీఐ, ఏసీబీ, పోలీసులమని చెప్పి ఎవరైనా ఫోన్ చేసి డబ్బులు అడిగితే భయపడి ఇవ్వవద్దు. సైబర్ వలలో చిక్కుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలి.

-పిన్నింటి రమేష్‌బాబు, ఎస్ఐ మెళియాపుట్టి



పాతపట్నం: బూరగాంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

సుపరిపాలన టీడీపీకే సాధ్యం

రాష్ట్రంలో సుపరిపాలన అందించగలిగేది టీడీపీ ఒక్కటేనని ఆ పార్టీ నేతలు అన్నారు. శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. -ఆంధ్రజ్యోతి బృందం



హరిపురం: బీఎన్‌పురంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



అరసవల్లి: నగరంలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



ఎచ్చెర్ల: ధర్మవరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ అవినాష్



పొందూరు: తాడివలసలో కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

రైతులకు అండగా నిలవాలి: ఎమ్మెల్యే అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా పాలకవర్గ సభ్యులు అండగా నిలవాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్‌గా పెదిని బాబ్జీ, డైరెక్టర్లుగా గిన్ని బలరాజు, బాని భారతి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎరువుల కొరత రానీయ కుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు సలీ తవిటయ్య, లోపింటి పద్మనాభం, నాయకులు మేరుగు సూర్య నారాయణ, దక్కత డిల్లీరావు, కామేష్, సబ్ డివిజనల్ కోపరేటివ్ అధికారి ఎల్.పాపారావు, డీసీసీబీ మేనేజర్ అనితా పండా, పీఏసీఎస్ సీఈవో బుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి దూరంగా ఉండాలి

కంచిలి, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కంచిలి పీఏసీఎస్‌లో సుమారు రూ.20 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న సభ్యులు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. కంచిలి పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పీఏసీఎస్ అధ్యక్షుడు పైల పురుషోత్తం రెడ్డి, డైరెక్టర్లు కిషోర్‌బాబు పాండే, డొక్కరి మహాలక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న విత్తనాలు, ఎరువులు రైతులకు సక్రమంగా అందిస్తూ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, డొక్కరి శంకర్రావు, పైల రామారావు, తమాలా కోటేశ్, టీవీ రమణ, ఎం.పూర్ణ, పూర్ణచంద్ర బిసోయ్, ఎస్.కామేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి గుర్తింపులేదు

● కార్యాలయం ఎదుట జనసేన కార్యకర్తల నిరసన




నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ శ్రేణులు

శ్రీకాకుళం అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం ముందునుంచి కష్టపడిన వారికి గుర్తింపులేదని, వైసీపీ నుంచి వచ్చిన వారికి పదవులిస్తున్నారని జనసేన కార్యకర్తలు, వీర మహిళలు ఆవేదన వ్యక్తంచేశారు. శ్రీకాకుళం జనసేన నేత మామిడి విష్ణు సమీపంలో దారపు జ్యోత్స్నకు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పలు పురు జనసేన నేతలు, కార్యకర్తలు పార్టీ జిల్లా కార్యాలయం ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. ఆది నుంచి పార్టీ కోసం పని చేసిన వారికి కాకుండా వైసీపీ నుంచి వచ్చిన జ్యోత్స్నకు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమించడం తగదని అసంతృప్తి వ్యక్తంచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీ జెండా మోసిన వారికి కాకుండా వైసీపీ నుంచి వలస వచ్చిన వ్యక్తికి పట్టం కట్టడం అన్యాయమంటూ వారు నినాదాలు చేశారు. తక్షణం ఆమెను మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు గురు ప్రసాద్, కామేష్, అప్పల రాజు, సాయి, నవీన్, శేఖర్, లక్ష్మి, వెంకీ, విష్ణుప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

45.355 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయం నిలుపుదల

● విజిలెన్స్ అధికారుల ఆదేశం



గోదామును పరిశీలిస్తున్న అధికారులు

కంచిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు వ్యవసాయాధికారులతో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. భగవాన్ గుప్తా రిటైల్ ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్లు, గోదాములోని ఎరువులు, పురుగు మందులను పరిశీలించారు. ఎరువుల ఆధనపు గోదామును జీఎస్టీలో పొందుపరచలేదని, గోదాములో ఉన్న 45.355 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలిచ్చారని ఏవో కొంకెన సురేష్ తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఎరువులు అమ్మవద్దని సంబంధిత యజమానికి ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఏడీఏ బి.విజయప్రసాద్, సీఐ, విజిలెన్స్ అధికారి ఆదారి సంతోష్‌కుమార్, డీవో కార్యాలయ ఏడీ వెంకటరావు, వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి

ఎచ్చెర్ల/జి.సిగడాం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఏడాదిలో కూటమి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నేత గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం చిలకపాలెం, గెడ్డకంచరాంలో వైసీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త ఓటర్లను నమోదు చేయాలని వారంతా యువతేనని, వీరంతా జనసేన వైపు ఆకర్షితులు కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బల్లాడ హేమమాలిని, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

శ్రీకాకుళం క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కామేశ్వరి కళ్యాణ మండపం సమీపంలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.46,970 నగదు స్వాధీనం చేసుకుని కేసు నిమిత్తం కోసం శ్రీకాకుళం ఒకటో పట్టణ స్టేషన్‌కు తరలించారు. గౌను గోవింద అలియాస్ గోల్డ్ గోపి గత కొన్నేళ్లుగా పేకాట స్థావరాలు నడుపుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం.

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ప్రాంగణ ఎంపికలు

ఎచ్చెర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో శుక్రవారం ప్రాంగణ ఎంపికలు మియామి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్‌లు పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

గార రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల కారణంగా ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు. వర్షాలు లేకపోవడంతో ఉష్ణో గ్రతలు పెరుగుతుండడం, తగ్గుతుండడం వంటి మార్పులతో జ్వరాలు వస్తున్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. మండల కేంద్రంతోపాటు అంగిపేట, ఎన్‌డీఏపేట, తోనంగి, బందరువానిపేట తదితర గ్రామాల్లో జ్వరపీడితులు అధికంగా ఉన్నారు. పీహెచ్‌సీలతో పాటు ప్రైవేటు ఆసుపత్రులకు ఎక్కువ సంఖ్యలో జ్వరాలతో వెళుతున్నారు. చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వైద్యులను సంప్రదించి వారిచ్చిన మందులు వాడిన తరువాత జ్వరం నుంచి ఉపశమనం కలిగి సప్తలేక శరీరంలోని పలు అవయవాలు బిగుసుకు పోవడం, కీళ్ల నొప్పులతో మంచానికే పరిమితమవు తున్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి మందులను పంపిణీ చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి జ్వరపీడితుల వివరాలను వైద్య సిబ్బంది సేకరించి మందులను పంపిణీ చేస్తున్నారు.



ఎన్‌డీఏపేటలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పీహెచ్‌సీ సేవలు వినియోగించుకోండి

జ్వరపీడితులు ఎక్కువగా ఉన్నప్పటికీ అన్ని జ్వరాలు విష జ్వరాలుగా కనిపించడం లేదు. కొన్ని అపోహల కారణంగా బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. ఒకవేళ జ్వరం వచ్చినట్లు అనిపిస్తే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. అన్ని రకాల వైద్య పరీక్షల కిట్లు ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దు. పీహెచ్‌సీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి.



-గోదల మౌనిక, వైద్యాధికారి

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం

ఇచ్ఛాపురం/ఆమదాలవలస, జూలై 18(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సమస్యల ను పరిష్కరించ కుంటే సమ్మె ఉధృతం చేస్తామని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు రమేష్ పట్నాయక్, తాడి సంతోష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. పారిశుధ్య కార్మికులు రెండోరోజు శుక్రవారం ఇచ్ఛాపురం, ఆమదాలవలసల్లో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, నాయకులు శ్రీనివాస రావు, తారకేశ్వరరావు, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





ఇచ్ఛాపురం, ఆమదాలవలసల్లో నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నేతలు

సహకార సంఘాల్లో అక్రమాలపై చర్యలు

● మండల సమావేశంలో డీసీసీబీ చైర్మన్ 'శివ్వాల'

సరుబుజ్జిలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట సహకార సంఘంతో పాటు జిల్లాలోని ఇతర సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటామని డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ.. కొత్తకోట సహకార సంఘం పరిధిలో గత మూడేళ్లలో మృతి చెందిన రైతుల పేరున వ్యవసాయరుణాలు తీసుకోవడంతో పాటు 13 మంది బినామీ రైతులకు రూ.1.30 కోట్లు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల సంఘాలపై రైతులకు నమ్మకం పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై డీసీసీబీ చైర్మన్ శివ్వాల స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్తకోట సంఘంలో అవినీతిని గుర్తించామన్నారు. సీఈవో బీపీ సన్యాసిరావు మాట్లాడుతూ.. గత పాలకవర్గ సమస్యలతోంతో పాటు వివిధ కారణాలతో ప్రస్తుతం రూ.39 లక్ష నష్టాల్లో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల మూసివేయడంపై జడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు ప్రశ్నించారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు కేవీజీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు గోవింద వెంకట శివానంద మూర్తి, ఎంపీడీవో ఎం.పావని తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో అభివృద్ధి

పొందూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణంతో అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. తాడివలస పంచాయతీ తాడివలస, లచ్చయ్యపేట, గుంజేడు గ్రామాల్లో రూ.1.60 కోట్లతో నిర్మించిన సిమెంట్ రోడ్లను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ చంద్రశేఖర్, సర్పంచ్ తమ్మినేని మనెమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

అరసవల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): అర్జీదారుల నుంచి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఏ కాలనీలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

● ఆమదాలవలస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్క రించేందుకు కృషి చేస్తామని టీడీపీ నేత, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణపురం ప్రాజెక్టు చైర్మన్ సనపల డిల్లీశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపదరావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పూడికతీత



గార జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగు నీటి కాలువల్లో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. వమరవల్లి, అంపోలు నీటి సంఘాల పరిధిలోని పలు చిన్న సాగునీటి కాలువల్లో చెత్తా చెదారాలను తొలగించే పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. జల వనరుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆయా నీటి సంఘాల అధ్యక్షుల పర్యవేక్షణలో ఈ పనులు చేపడు తున్నారు. దీంతో కాలువల్లో నీటి ప్రవాహం పెరుగుతోందని, ఖరీఫ్‌కు సాగునీటి సమస్య తీరుతుందని ఆయకట్టు రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఒడియా మాధ్యమం పుస్తకాల పంపిణీ

కంచిలి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండల, డీజీపురం, నువాగడ, జలంత్రకోట, బొగాబేణి, కొనక, ఎంఎస్ పల్లి జడ్పీ పాఠశాలల్లోని ఆరో తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ఆధ్వర్యంలో ఒడియా మాధ్యమం పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాసుదేవ్ పాడి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి తదితరులు విద్యార్థులకు పుస్తకాలు అందించారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి: ఎన్ఈఆర్



మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి నీటిని అందిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

ఎచ్చెర్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. డి.మత్స్యలేశం గ్రామంలో వైశాలి ఫౌండేషన్ సహ కారంతో ఏర్పాటు చేసిన మూడు మినరల్ వాటర్ ప్లాంట్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలు తమ పరిసర గ్రామాల అభివృద్ధికి సీఎస్ఆర్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణ మూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, కూటమి నేతలు సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు, పైడి అన్నంనాయుడు, గొలివి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి 'కొల్లు' పర్యటన

సోంపేట రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ఎకువూరులో పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు మద్దు కుమార్ తెలిపారు. ఎకువూరు బీచ్ నుంచి బట్టిగళ్లూరు బీచ్ వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్‌తో కలిసి పాల్గొంటారన్నారు.

వ్యాక్సిన్‌లు వేయించండి

లావేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో తరచూ వచ్చే లంపిస్కిన్ నివారణకు టీకాలు వేయించాలని బెజ్జిపురం పశువైద్యాధికారి లావణ్య తెలిపారు. బెజ్జిపురంలో సుమారు 300 పశువులకు వ్యాక్సిన్ వేసినట్టు ఆమె తెలిపారు.

ఆమె నేత్రాలు సజీవం



జయలక్ష్మి (ఫైల్)

అరసవల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): తాను మరణించినా మరో ఇద్దరి కళ్లలో వెలుగులు నింపారు జయలక్ష్మి. నగరంలోని చంపాగల్లి వీధికి చెందిన అంధవరపు జయలక్ష్మి (68) శుక్రవారం మృతిచెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించుకుని రెడ్‌క్రాస్‌కు సమాచారమిచ్చారు. వెంటనే ఐబ్యాంకు టెక్నీషియన్ పి.సుజాత, బి.జగదీష్ వెళ్లి కార్నియాలను సేకరించి, విశాఖ ఎల్వీ ప్రసాద్ నేత్రాలయానికి తరలించారు.

పరిశుభ్రత పాటించాలి

జి.సిగడాం, జూలై 18(ఆంధ్రజ్యోతి): పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం టీడీవలస గ్రామాన్ని సందర్శించారు. ఐడీవలస గ్రామంలో పలువురు జ్వరాల బారిన పడిన సంగతి విదితమే. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. డీఎల్‌పీవో గోపీబాల, ఎంపీడీవో జగన్నాథం, ఎస్.యశ్వంత్ వైద్యాధికారి యశ్వంత్ పాల్గొన్నారు.

సేనాపతి అప్రమత్తంగా ఉండాలి

సోంపేట రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతు న్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హరిబాబు నాయుడు అన్నారు. జీడి పుట్టుగ కొత్తూరులో శుక్రవారం మహిళల భద్రతపై అవగాహన కల్పించారు.

45 మంది విద్యార్థులుండాలి

పొందూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు ఉండాలని డిప్యూటీ విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి అన్నారు. ఎంఈఓలు, ప్రభుత్వ ఉపాధ్యాయుల పాఠశాలలను సందర్శించారు. మండల కేంద్రంలో దానుమాన్ స్కూల్ (ఎంపీపీ-2) పాఠశాలను పునరుద్ధరించినట్లు ఎంఈవోలు శ్రీరాములు, రాజారావు తెలిపారు. గతంలో ఈ పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను ఎత్తివేశారు. అయితే స్థానికుల ఆందోళనతో పునరుద్ధరించారు.

క్రైం కార్నర్

మహిళపై చీటింగ్ కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భవనంలో ఫ్లోర్ కోసం రూ.10 లక్షలు అడ్వాన్స్ తీసుకొని రిజిస్ట్రేషన్ చేయలేదనే కారణంతో ఓ మహిళపై రెండో పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిసిన వివరాల మేరకు రొక్కం సాహితి అనే మహిళ పీఎన్‌కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించిన ఒక ఫ్లోర్‌ను 2023లో రూ.90 లక్షలకు విక్రయించేందుకు శిల్లా శ్రీనివాసరావుతో అగ్రిమెంట్ చేసుకుంది. దీని కోసం రూ.10 లక్షలు అడ్వాన్స్ తీసుకుంది. ఆమె ఇప్పటివరకు భవనంలో ఫ్లోర్‌కు రిజిస్ట్రేషన్ చేసి అప్పగించలేదని శ్రీనివాసరావు పోలీసులకు తెలిపారు. అంతేకాకుండా అదే ఫ్లోర్‌కు ఆమె వివిధ బ్యాంకుల్లో రుణం పొందిందని తెలిపారు. మరికొందరికి అగ్రిమెంట్లు కూడా చేసిందని తెలిపారు. దీనిపై శిల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మద్యం సీసాలతో తండ్రీ కొడుకుల అరెస్టు

టెక్కలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పెద్దసాన గ్రామానికి చెందిన కోరాడ మహేష్ శుక్రవారం 30 మద్యం సీసాలతో, అతని తండ్రి గోవిందరావు గురువారం 20 మద్యంతో పట్టుబడినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. టెక్కలి నుంచి బెల్టుషాపు ద్వారా అమ్మకానికి మద్యం తీసుకువెళ్తూ చిక్కారని తెలిపారు.

రిటైర్డ్ ఏఎస్ఐ ఇంట్లో చోరీ

టెక్కలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ శ్రీనివాస్‌నగర్‌లో ఉంటున్న విశ్రాంత ఏఎస్ఐ నర్సింహమూర్తి ఇంట్లో చోరీ జరిగింది. ఏ మేరకు నష్టం జరిగిందన్నది పోలీసులకు తెలియరాలేదు. శుక్రవారం ఇంటి తలుపులు తెరచి ఉండడంతో ఇరుగు పొరుగు వారు గుర్తించి..పోలీసులకు సమాచారం అందించారు. జూన్ 18న ఆయన హైదరాబాద్ వెళ్లడంతో చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. విషయం తెలుసుకొని ఆయన హైదరాబాద్ నుంచి వస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

కేజీ వెండి ఆభరణాల చోరీ


ఇంట్లో పరిశీలిస్తున్న క్లూస్ టీమ్ సభ్యులు

రణస్థలం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన లంక దిలీప్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీరువాను విరగగొట్టి కేజీ వెండి ఆభరణాలు, ఒక తులం బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని పరిశీలించారు. బాధితుడు దిలీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో రోడ్డు ప్రమాదం

● కారులో ప్రయాణిస్తున్న ఐదుగురి మృతి ● మృతుల్లో జిల్లా వాసులు


ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు


జాడ కృష్ణ (ఫైల్)

ఆదిభట్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదం జరిగి ఐదుగురు దుర్మరణం చెందారు. మృతుల్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధి బొంగులూరు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దాసరి తండాకు చెందిన గుగులోత్ జనార్దన్ (45), వరంగల్ జిల్లా పాకాలకు చెందిన మాలోత్ చందులాల్(29), ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా వేదులవలస గ్రామానికి దాసరి భాస్కర్‌రావు(39), విజయనగరం జిల్లా తెర్లాం మండలం కల్మరాజుపేట గ్రామానికి చెందిన జాడ కృష్ణ(25) కొంతకాలంగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రీన్‌వ్యాలీ రిసార్టులో పనిచేస్తున్నారు. పరిచయస్తుడైన ఎన్కేపల్లికి చెందిన కావలి బాల్‌రాజ్ (40) కారులో గురువారం రాత్రి 9గంటలకు యాదాద్రి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా ఘట్కేసర్ వద్ద అదే రాత్రి 2.45 గంటలకు ఔటర్ రింగు రోడ్డుపైకి వచ్చారు. మూడు గంటలప్పుడు బొంగులూరు ఎగ్జిట్ 12 సమీపంలోని మైల్‌స్టోన్ 101 వద్ద వీరి కారు ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న జనార్దన్, చందులాల్, భాస్కర్‌రావు, బాల్‌రాజ్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కృష్ణ తీవ్రంగా గాయపడడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం

ఎల్.ఎన్.పేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేద ప్రజలను ఆదుకోనేందుకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా చిన్నకొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో శుక్రవారం జరిగిన వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వ్యాపార ధోరణిలో దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.జ్యోతిలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు పి.విష్ణు, ఆర్.రామారావు, ఎస్.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లండి

వజ్రపుకొత్తూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడి మోసాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని మాజీ మంత్రి అప్పలరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం వజ్రపుకొత్తూరులో మండల స్థాయి వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో మంజూరు చేసిన పథకాలకే శిలాఫలకాలు వేసి ఫొటోలు దిగుతున్నారని ఆరోపించారు. సమావేశంలో వైసీపీ నాయకులు ఉదయకుమార్, రాజారావు, పాలిన శ్రీనివాస్, దువ్వాడ మధుకేశవరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సమావేశంలో మైక్‌లు సరిగా పనిచేయక పోవడంతో వక్తలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితిని గమనించిన మాజీ మంత్రి అప్పలరాజు తానే మైక్‌సెట్ ఆపరేటర్‌గా మారి సౌండ్‌సిస్టంను సరిచేశారు.

డిప్యూటీ ఎంపీడీవోగా తిరుమల

మందస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మందస డిప్యూటీ ఎంపీడీవోగా ఎ.తిరుమల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన శ్రీకాకుళం డుమా కార్యాలయం నుంచి పదోన్నతిపై మందసకు వచ్చారు. ఇక్కడ పని చేసిన వై.రవిప్రసాద్ కవిటి మండలానికి బదిలీపై వెళ్లారు.

రహదారికి మోక్షం కల్పించాలని వినతి


గాంధీనగర్‌కు రహదారి కావాలని ఎమ్మెల్యే శిరీషకు విన్నవిస్తున్న ప్రజలు

పలాస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ లో రహదారి లేక తాము తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నామని, కాలువపైనే ప్రమాదకర రీతిలో ప్రయాణించాల్సి వస్తోందని స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది ఆమెకు తమ సమస్యలను విన్నవించారు. గాంధీనగర్‌కు చెందిన ప్రజలు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నామని, మురుగునీరు వెళ్లే కాలువ మీదుగా ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నామని తెలిపారు. రహదారి నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలని కోరారు. వంశధార నీటి కోసం, అండర్‌పాసేజీలు నిర్మించాలని, టిడ్కో గృహాలు, ప్రభుత్వ ఇళ్ల స్థలాలు, వితంతు, వృద్ధాప్య పించన్లు ఇవ్వాలని అనేక మంది విన్నవించారు. తల్లికివందనం తమకు పడలేదని కొంతమంది తల్లిదండ్రులు శిరీషకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పరిష్కరిస్తున్నామన్నారు. వంశధార నీరు శివారు గ్రామాలకు ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. కిడ్నీ ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా ఇప్పటికే దాతల సాయంతో డయాలసిస్ యూనిట్లు తీసుకువచ్చామన్నారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు, గురిటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

హరిపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం చత్రపురం వద్ద సునాముది నుంచి జెన్నా చెరువు కాలువ మరమ్మతు పనులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చేనుకు నీరు.. ప్రతి చేతికి పని నినాదంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, ఏఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

అంబుగాం గ్రామానికి చెందిన మజ్జి ప్రవీణ్ కుటుం బానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించి రూ.91వేల చెక్కును ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం అందజేశారు. తమకు సాయం అందించిన ఎమ్మెల్యే శిరీష, వెంకన్న చౌదరి, పీరుకట్ల విఠల్ తదితరులకు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టండి


బొమ్మికలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పీవో

పాతపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. లాబర బాలుర, బొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. పాఠశాలల పరిసరాలను, వంట గదులను పరిశీలించారు. మెనూ, బోధన తీరుపై విద్యార్థులను ప్రశ్నించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలలో భాగంగా తాగడానికి వేడినీరు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. మెనూ నిర్వహణలో విఫలమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సరళతరమైన విధానాలతో విద్యార్థులకు బోధించాలని సూచించారు. వెనుకబడిన వారికి ప్రత్యేకంగా బోధించాలని హెచ్ఎంలు, ఉపాధ్యాయ సిబ్బందిని ఆదేశించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్సుల రద్దు


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో కృష్ణమూర్తి

కోటబొమ్మాళి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లు తమ వద్ద నిల్వలు ఉంచుకొని అధిక ధరలకు అమ్ముకొనేందుకు కొరత సృష్టిస్తే లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టెక్కలి ఆర్‌డీవో కృష్ణమూర్తి హెచ్చరించారు. ఆయన శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో గల సకలాభక్తుల పెంటయ్య ఎరువుల దుకాణాన్ని తహసీల్దార్ ఆర్.అప్పలరాజుతో కలిసి తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ లో ఉన్న లెక్కల ప్రకారం గొడౌన్‌లో ఉన్న ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎరువుల కొరత లేకుండా సకాలంలో రైతు సేవా కేంద్రాలు, డీలర్ల ద్వారా రైతులకు అందించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలలో వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావు, డీటీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారులకు సహకరించవద్దు


రిలే దీక్షలు చేస్తున్న దళిత నాయకులు

టెక్కలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చింతలగార రెవెన్యూ పరిధిలో 31.5సెంట్ల భూమి సబ్ డివిజన్‌కు సంబంధించి రెవెన్యూ అధికారులు, సిబ్బంది తప్పిదాలకు పాల్పడుతున్నారని కోటబొమ్మాళి మండలం జీయన్నపేట గ్రామానికి చెందిన బోకర మోహనరావు, సీపీఐ దళిత మహాసభ నాయకులు యడ్ల గోపి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దళితుడినైన తన భూమిని కబ్జాకు ప్రయత్నిస్తూ నంబూరు షణ్ముఖరావు, శ్రావణ్‌లు అడ్డుకుంటున్నారని, ఇందుకు సర్వే విభాగం అధికారులు సహకరిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సంఘటనపై పోలీసులకు జూన్ 14న ఫిర్యాదు చేశామని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, నారాయణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత భూముల పరిశీలన


ఆక్రమణలపై విచారణ చేపడుతున్న అధికారులు

మెళియాపుట్టి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మల్లికార్జున స్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆక్రమణలను దేవదాయశాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆలయానికి వెళ్లే మార్గాన్ని మూసేసి..షెడ్ ఏర్పాటు చేయడంపై కొంతమంది భక్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆలయ అర్చకులు సన్నారథీతో పాటు కొంతమంది భక్తుల నుంచి అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆలయం చుట్టు పక్కల ఉన్న దుకాణాల అద్దెలతో గుడిని అభివృద్ధి చేయాలని కొంతమంది భక్తులు సూచించారు. ఆలయం చుట్టుపక్కల ఉన్న ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చి.. తొలగింపు ప్రక్రియ చేపట్టనున్నట్టు దేవదాయ శాఖ ఈవో వాసుదేవరావు తెలిపారు. ఆక్రమణదారులు షెడ్లను సొంతంగా తొలగించాలని .. లేదంటే తామే తొలగిస్తామని తెలిపారు. ఆయనతో పాటు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, గాంధీ రెడ్డి, దున్నా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆదాయం


రైతులకు అవగాహన కల్పిస్తున్న సునీత

జలుమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం సాధించవచ్చని ఉద్యానవన అధికారి కె.సునీత అన్నారు. అల్లాడ పంచాయతీ రామదాసుపేటలో రైతు గొద్దు ముసలినాయుడు పొలంలో శుక్రవారం నిర్వహించిన ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒక ఎకరా విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేసి రూ.లక్ష ఆదాయం పొందవచ్చన్నారు. రైతులకు ఒక ఎకరాకు 40 నుంచి 50 మొక్కల వరకు ప్రభుత్వం రాయితీతో ఇస్తుందన్నారు. అంతర పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. బిందు సేద్యానికి 90 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సిబ్బంది ఆమని, మీనాక్షి, అల్లాడ, రామదాసుపేట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మందస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలంటే మొక్కలను సంరక్షించుకోవాలని ఎంఈవో ఎం.లక్ష్మణరావు అన్నారు. మందస ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో సెల్వన్‌రాజు, అధికారులు డి.రాంబాబు, ఆర్.లవరాజు పాల్గొన్నారు.

స్వీయ ధ్రువీకరణతో భవనాలకు అనుమతులు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామారావు

పలాస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వీయ ధ్రువీకరణ విధానంతో సులభంగా భవన నిర్మాణాలకు అనుమతులు లభిస్తాయని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన స్వీయ ధ్రువీకరణ విధానం మధ్యతరగతి వారికి వరమని తెలిపారు. కార్యాలయానికి వెళ్లకుండా అనుమతులు తీసుకోవచ్చన్నారు. వంద నుంచి 200 చదరపు గజాల లోపు పేద, మధ్య తరగతి వారు దీనికి అర్హులన్నారు. మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని, అవసరమైతే కోర్టులో కేసులు నమోదు చేయాలన్నారు. తప్పనిసరిగా అనుమతులు తీసుకొనే నిర్మాణాలు చేప ట్టాలని ఈ సందర్భంగా కోరారు.

కవితలతోనే సామాజిక చైతన్యం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

హరిపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కవితలతోనే సామాజిక చైతన్యం కలిగించేందుకు రచయితలు కృషి చేయాలని విశ్రాంత ఉపాధ్యాయులు కింతల కృష్ణమూర్తి అన్నారు. మందస మండలం హరిపురంలోని ప్రైవేటు కళాశాల ఆవరణలో ఉపాధ్యాయులు దుప్పల రవికుమార్‌తో పాటు ఉత్తరాంధ్రలోని 260మంది ప్రముఖ కవులు రాసిన కవితా సంపుటిని 'మంజూరు' పేరుతో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు నల్లి ధర్మారావు, కుమార్ నాయక్, దాసరి తాతారావు తదితరులు మాట్లాడుతూ ఉద్దానం జానపద సాహిత్య కళావేదిక ఈ ప్రాంత కవులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మామిడి కృష్ణారావు, మజ్జి భాస్కరరావు, దుదిష్టినాయుడు, బి.శివ, లోకేశ్వరరావు, రాజేంద్ర, గణపతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

పలాస, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించేందుకు విద్యార్థులు చొరవ తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు కోరారు. శుక్రవారం కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటార ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ పి.మధు, ఐక్యూఎస్ కోఆర్డినేటర్ పి.వి.రమణ, అధ్యాపకులు శ్రీనివాస్‌పట్నాయక్ పాల్గొన్నారు.

మండేలా జీవితం ఆదర్శప్రాయం

పాతపట్నం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నల్లసూరీడు నెల్సన్ మండేలా జీవితం ఆదర్శనీయమని హెచ్ఎం ఎస్.వైకుంఠరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నెల్సన్ మండేలా జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ

పోలాకి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి దుర్గాకాలనీలో వేంచేసి ఉన్న దుర్గాగిరి అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు చిన్నారావు, దాలయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మంత్రి అచ్చెన్న పర్యటన

టెక్కలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం సాయంత్రం 4 గంటల నుంచి టెక్కలి మేజర్ పంచాయతీలో పర్యటించనున్నారని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీకి, శ్రీనివాస్‌నగర్‌లో రోడ్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనంతరం శ్రీనివాసనగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్దఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

చిరుధాన్యాలు సాగు చేయండి

మెళియాపుట్టి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు చిరుధాన్యాల పంటలు పండిస్తే మంచి లాభాలు వస్తాయని కొత్తూరు వెలుగు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వీరి ఆధ్వర్యంలో శుక్రవారం అంపురంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. అధికంగా ఆదాయం వచ్చే రాగి, సామలు, కొర్రలు వంటివి వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ నాగరాజు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

హిరమండలం, జూలై 18(ఆంధ్రజ్యోతి):స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో కాంప్లెక్స్ ఛైర్మన్లు, హెచ్ఎంలు, సీఆర్ఎంటీలతో సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఈ సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశాలు ఉన్నందున ఒంటి పూట బడి నిర్వహిస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు.

మెరైన్ పోలీసుల పల్లెనిద్ర

సంతబొమ్మాళి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పాతమేఘవరంలో మెరైన్ అధికారులు గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా భావనపాడు మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ తీవ్రవాదులు, దేశ వ్యతిరేక శక్తులు గ్రామంలోకి ప్రవేశించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా తీరం వెంబడి మాదక ద్రవ్యాలను రవాణా చేస్తే కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ టోల్‌ఫ్రీ నెంబరు 1093, 93929 14712లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాసరావు సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటరావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఉచిత వైద్యం

టెక్కలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వాహనాలు నడిపే డ్రైవర్లకు వైసీబీపీయూ ట్రక్కర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం లారీ డ్రైవర్లకు, సిబ్బందికి ఐసీటీసీ వ్యాన్ల ద్వారా ఉచిత వైద్యసేవలు అందించినట్టు హెల్త్ ఎడ్యుకేటర్ బి.హరినాథ్ తెలిపారు. వివిధ అనారోగ్య సమస్యలు ఉన్న 30మందిని గుర్తించి వైద్యసేవలు అందించామని వారు పేర్కొన్నారు.